క్లుప్తంగా

భవానీలకు భిక్ష



మండపేటలో అమ్మవారిని దర్శించుకుంటున్న రెడ్డి రాధాకృష్ణ

కపిలేశ్వరపురం (మండపేట): పట్టణంలోని గాంధీ నగర్ విజయదుర్గాదేవి నవరాత్ర శిబిరంలో సోమవారం భవానీ మాలధారులకు వైఎస్సార్ సీపీ నాయకుడు, మున్సిపల్ కౌన్సిల్ కో–ఆప్షన్ సభ్యుడు రెడ్డి రాధాకృష్ణ భిక్ష ఏర్పాటు చేశారు. అమ్మవారిని దర్శించుకుని భవానీ పూజా కార్యక్రమాన్ని తిలకించారు.

పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ వెంకటనారాయణ

రామచంద్రపురం: సెలవులు సంతోషాన్ని పంచాలి కానీ చావు వార్తలు కాదని రామచంద్రపురం సీఐ వెంకట నారాయణ సోమవారం విలేకరుల సమావేశంలో అన్నారు. సెలవుల్లో చాలామంది పిల్లలు కోటిపల్లి నుంచి మసకపల్లి వరకు ఉన్న గోదావరి ఏటిగట్టుకు సరదాగా స్నేహితులతో కలిసి గోదావరి స్నానాలకు వస్తున్నారని, అదే సమయంలో అనుకోని ప్రమాదాలతో ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటిలోని పెద్దలకు చెప్పకుండా రావడం, పెద్దలు తోడు లేకపోవడం, ఈత రాకపోవడం, లోతును సరిగా అంచనా వేయలేకపోవడం, అత్యుత్సాహం తదితర కారణాలతో ఎంతో భవిష్యత్తు ఉన్న పిల్లలు ప్రాణాలు కోల్పోయి వారి కుటుంబాల్లో విషాదం నింపుతున్నారన్నారు. అందువల్ల తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోని, చిన్నారులకు అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో రామచంద్రపురం ఎస్సై ఎస్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎంపీడీఓను కలిసిన ఉద్యోగులు



కపిలేశ్వరపురంలో ఎంపీడీఓ భానూజీరావును కలిసిన ఉద్యోగులు

కపిలేశ్వరపురం: ఇటీవల బాధ్యతలు చేపట్టిన కపిలేశ్వరపురం ఎంపీడీఓ భానూజీరావును పలు శాఖల ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిశారు. మండపేట తాలూకా ఏపీఎన్జీఓ సంఘం అధ్యక్షుడు జిత్తుక మల్లిఖార్జునుడు ఆధ్వర్యంలోని వైద్య ఆరోగ్య, వ్యవసాయ, పంచాయతీ, విద్య తదితర శాఖల అధికారులు, ఉద్యోగులు ఎంపీడీఓను కలిశారు. తహసీల్దార్ జి.శ్రీనివాస్ సమక్షంలో మండలంలోని పలు సమస్యలపై చర్చించారు.

మూడు చక్రాల బైక్ ఇప్పించండి

గ్రీవెన్స్ సెల్‌లో దివ్యాంగుడి విన్నపం



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగుడు జానకిరామయ్య

రాయవరం: దివ్యాంగుడనైన తనకు మూడు చక్రాల బైక్‌ను ఇప్పించాలని కోరుతూ దివ్యాంగుడు రాయవరం ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశాడు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్‌కు రాయవరం మండలం సోమేశ్వరానికి చెందిన నాగదేవర జానకిరామయ్య వచ్చాడు. రెండు కాళ్లు పని చేయకపోవడంతో స్థానికుల సహకారంతో కార్యాలయానికి చేరుకున్నాడు. డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న తనకు బైక్ ఇవ్వాలని ఎంపీడీవో కీర్తి స్పందనకు వినతిపత్రం అందజేశాడు. అలాగే గ్రామాల్లో పారిశుధ్య లోపంతో దోమలు ప్రబలి ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలంటూ బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. గ్రామాల్లో కుక్కల బెడద అధికంగా ఉందని, పలువురిపై దాడి చేసి తీవ్రంగా గాయపరుస్తున్నాయని, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ నాయకులు చాట్రాతి జానకిరామయ్య, చిరట్ల సుబ్బారావు తదితరులు ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు.

ట్రస్టు బోర్డు ప్రమాణ స్వీకారం

ఆలమూరు: మండలంలోని ప్రసిద్ధ దేవాలయంగా ప్రఖ్యాతి గాంచిన నూకాంబిక అమ్మవారి ఆలయం ట్రస్టు బోర్డు ప్రమాణ స్వీకారం జరిగింది. స్థానిక ఆలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమానికి ధర్మకర్తల చైర్మన్ వీరి అప్పారావు నేతృత్వంలో సభ్యులతో ఈఓ ఉండవల్లి వీర్రాజు ప్రమాణం చేయించారు.

నియమాల తోరణం



నాగుల చెరువులో అగ్నిగుండం తొక్కుతున్న భవానీలు



కపిలేశ్వరపురంలో దుర్గాదేవి హోమం చేస్తున్న మాలధారులు

- శరన్నవరాత్ర ఉత్సవాల్లో మాలధారులు
- నియమనిష్టలతో అమ్మవారికి పూజలు
- భక్తిశ్రద్ధలతో దీక్ష ఆచరణ

కపిలేశ్వరపురం: గత కాలపు సంస్కృతి సంప్రదాయాలకు ఆనవాళ్లే నేడు జరుపుకుంటున్న పండుగలు. జాతరలు, ఉత్సవాలు మతపరమైనవిగా మాత్రమే చూడడానికి పరిమితం కాకుండా వాటిలోని చారిత్రక మూలాలకు ఆలోచన చేయడం ద్వారా అనేక శాస్త్రీయ అంశాలు అవగాహనకొస్తాయి. ప్రకృతిపై ఈనాటికి పరిమితంగా ఉన్న జ్ఞాన పునాదిపై మానవులకు ఏర్పడ్డ భయం, భక్తి తదితర భావాలను విశ్లేషించుకోవాలి. ప్రకృతిపై సాధించిన విజయాలకు గుర్తుగా దసరా పండుగను జరుపుకుంటారని సాహితీవేత్తలు చెబుతున్నారు.

రెండు నియోజకవర్గాల్లో ప్రత్యేకత ఇలా..

అష్టాదశ శక్తి పీఠాల్లో 12వ శక్తి పీఠం రామచంద్రపురం మండలం ద్రాక్షారామ మాణిక్యాంబ అమ్మవారి ఆలయంలో ఉంది. దసరాను వైభవంగా నిర్వహిస్తారు. రాయవరం మండలం వెదురుపాక విజయదుర్గాపీఠంలో పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం (గాడ్) ఆధ్వర్యంలో శరన్నవరాత్ర ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో జరుపుతారు. కాజులూరు మండలం గొల్లపాలెంలో శరన్నవరాత్రుల్లో బేతాళునికి విశేష పూజలు చేస్తారు. విజయదశమి రోజున ఏనుగుల సంబరం నిర్వహిస్తారు. ఎండుగడ్డితో తయారు చేసిన ఏనుగు విగ్రహాలను ఎద్దుల బండి, ట్రాక్టరుపై ఊరేగిస్తారు.

దసరా ఔన్నత్యమిదీ..

ప్రకృతిని ఆరాధిస్తూ మాతృమూర్తిని దుర్గామాతగా కొలిచే పండుగగా దసరాను జరుపుకుంటారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా చెబుతారు. మహిషాసురుడిని సంహరించిన దుర్గాదేవిని విజయానికి చిహ్నంగా ప్రచారం చేస్తారు. పాండవులు అజ్ఞాతం వీడి జమ్మి చెట్టుపై ఉన్న ఆయుధాలను తీసుకొని యుద్ధం చేసి సాధించిన విజయంగా చెబుతారు. దసరా వచ్చిందయ్యా దశనే మార్చిందయ్యా అంటూ ఓ సినీ గేయ రచయిత చెప్పిన సంగతి అందుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. ఏటా ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి మొదలు నవమి వరకూ దసరా జరుపుకుంటారు. ఆశ్వయుజ మాసం నుంచి వర్ష రుతువు వెళ్లి శరత్ రుతువు ప్రారంభమవుతుంది. అందువల్ల శరన్నవరాత్రులుగా పిలుస్తారు. ఆ రుతువులో వర్షాకాలం ముగిసి చలికాలం ప్రారంభమవుతుంది. ఈ కాలంలో వాతావరణంలో కలిగే మార్పులతో వ్యాధులు ప్రబలే అవకాశాలుండటం వల్ల శక్తి ఆరాధన పేరుతో పరిశుభ్రంగా ఉండేలా నియమాలు రూపొందించబడ్డాయన్న భావన ఉంది.

మాలధారణ ప్రత్యేకత ఇదీ

శరన్నవరాత్ర ఉత్సవాల్లో అమ్మవారి భక్తులు భవానీ మాలను ధరిస్తారు. నియమనిష్టల పేరుతో ప్రకృతి సిద్ధమైన జీవితాన్ని గడుపుతారు. భక్తులు తమ, తమ పరిస్థితులు ఆధారంగా పరిమిత సంఖ్యలో రోజులను నిర్దేశించుకొని మాలను ధరిస్తారు. అంతిమంగా దశమి రోజుకు మాల ప్రక్రియను పూర్తి చేసుకునేలా చూసుకుంటారు. దశమికి విజయవాడలోని కనకదుర్గమ్మ దర్శనం చేసుకుంటారు. మండలి దీక్ష ఆసక్తి ఉన్నవారు 40 రోజులపాటు నియమనిష్టలతో జీవితాన్ని గడిపి ఆఖరు రోజైన 41వ రోజు దీక్షను విరమిస్తారు. అర్ధమండలి దీక్షను మనసులో అనుకున్న వారు 20 రోజులపాటు మాలధారణలో ఉంటారు. దీక్షాధారణలో ఉన్నన్ని రోజులూ ప్రకృతికి దగ్గరగా జీవించేలా నియమాలు రూపొందించబడ్డాయి. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో అమ్మవారి పూజ చేస్తారు. కుంకుమ పువ్వు రంగుల వస్త్రాలను ధరిస్తారు. సామూహికంగా భవానీ మాలధారులు నిర్దేశించుకున్న చోట పీఠాన్ని ఏర్పాటు చేసుకుంటారు. అత్యధిక సార్లు మాలధారణ చేసిన గురు భవాని మిగిలిన భవానీలచే పూజలు చేయిస్తారు. మహిళలు, పురుషులు, చిన్నారులు ఇలా అన్ని వర్గాల వారు మాలను ధరించే అవకాశం ఉన్నందున కుటుంబసమేతంగా మాలను ధరిస్తుంటారు. దీక్షలో ఉన్నన్ని రోజులూ మద్యానికి దూరంగా ఉంటారు. మాంసాహారాన్ని ముట్టరు. ధూమపానాన్ని త్యజిస్తారు. మితంగా ఆహారాన్ని తీసుకునే చర్యల్లో భాగంగా పగటిపూట భోజనం చేసి రాత్రి సమయాల్లో అల్పాహారాన్ని మాత్రమే భుజిస్తారు. పాదరక్షలు, క్షరకర్మ లేకుండా మనసా వాచా కర్మణా బ్రహ్మచర్యం పాటిస్తూ భక్తి శ్రద్ధలతో గడుపుతారు.

పశువులకు టీకాలు

కపిలేశ్వరపురం: కేంద్ర ప్రభుత్వ సహకారంతో జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా సోమవారం వెదురుమూడిలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. పశు వైద్యాధికారులు డాక్టర్ రమణమూర్తి, కె.మాధురి పర్యవేక్షణలోని సిబ్బంది క్షేత్ర స్థాయిలోని పశువులకు టీకాలు వేశారు. వైద్యాధికారులు మాట్లాడుతూ, 23న పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురం, 24న అంగర, కేదారిలంక, 25న అద్దంకివారిలంక గ్రామంలో టీకాలను వేయనున్నామన్నారు.

పశుపోషణ పట్ల అవగాహనతో మెలగాలి

కపిలేశ్వరపురం: పశుపోషణ పట్ల పాడి రైతులు అవగాహనతో మెలగాలని పశు సంవర్ధక శాఖ ఆలమూరు ఏడీఏ ఎల్.అనిత అన్నారు. టేకిలో సోమవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. వైద్యాధికారి కె.మాధురి, రామకృష్ణ, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

కె.గంగవరం: పాడి రైతులు నిర్లక్ష్యం వహించకుండా ప్రతి పశువుకు టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని రామచంద్రాపురం పశుసంవర్ధన శాఖ ఏడీ రామకృష్ణ అన్నారు. మండలంలోని శివలలో సోమవారం పశుసంవర్ధన శాఖ ఆధర్యంలో నిర్వహించిన గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ఉచితంగా పశువులకు టీకాలు వేయిస్తుందన్నారు. పశువులకు చికిత్స అందించడానికి ఉచితంగా వైద్య శిబిరాలు, మందులు అందిస్తారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పాడి సంపద వల్ల ఆర్థికంగా ఎదిగేందుకు పాడి రైతులు ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పేకేరు పశువైద్యులు సురేష్ బాబు, యర్రపోతవరం వీఎల్ఓ కాశీ విశ్వేశ్వరరావు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.



అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు

భీమేశ్వరాలయంలో ఉచిత ప్రసాద వితరణ



భీమేశ్వరాలయంలో ఉచిత ప్రసాద వితరణ ప్రారంభించిన దాత సుబ్బారెడ్డి

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో దసరా మహోత్సవాలను పురస్కరించుకుని దసరా 10 రోజుల పాటు అందించే ఉచిత ప్రసాద వితరణను ప్రముఖ పారిశ్రామిక వేత్త, దాత సత్తి సుబ్బారెడ్డి సోమవారం ప్రారంభించారు. గత కొన్ని సంవత్సరాలుగా ఆయన ఉచిత ప్రసాద వితరణను ఏటా క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ఆయన కుమారుడు సత్తి సత్తిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యంపై అవగాహన అవసరం



పెనుమళ్లలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

కపిలేశ్వరపురం: సంపూర్ణ ఆరోగ్యంపై అవగాహన అందరికీ అవసరమని, ఆ అవగాహన కల్పించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం స్వస్థ్ నారీ– సశక్త్ పరివార్ అభియాన్ పేరుతో ప్రత్యేక ఆరోగ్య ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని అంగర పీహెచ్‌సీ వైద్యాధికారిణి డా.రత్నకుమారి అన్నారు. అంగరలో సోమవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షిస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు. ఎంపీహెచ్ఈఓ జిత్తుక మల్లిఖార్జునుడు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి.రామారావు, ఎంపీహెచ్ఎస్ బిషప్ మాట్లాడుతూ, మహిళలకు బీపీ, షుగరు, నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లపై అవగాహన కల్పించారు.

కాజులూరు: దేశంలో మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ దూడల శంకర్‌నారాయణ అన్నారు. సోమవారం దుగ్గుదురులో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిణి వై.సుప్రియ ఆధ్వర్యంలో జరిగిన స్వస్థ్ నారీ– సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో శంకర్‌నారాయణ తదితరులు పాల్గొన్నారు. గొల్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారులు సౌజన్య, శ్రేయ ఆధ్వర్యంలో పెనుమళ్లలో వైద్య సిబ్బంది పలువురు మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో దుగ్గుదుర్రు సర్పంచ్ పోతు వెంకటలక్ష్మి, పెనుమళ్ల మాజీ సర్పంచ్ వనుం వీరబ్రహ్మం, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కె.గంగవరం: ప్రజలు, మహిళలు గ్రామాల్లో స్వస్థ్ నారీ– సశక్త్ అభియన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి చంద్రరావు అన్నారు. మండలంలోని సుందరపల్లిలో జరుగుతున్న ఉచిత వైద్య శిబిరంలో నాయకులు పాల్గొన్నారు.

అనంతరం పామర్రు పీహెచ్‌సీ వైద్యుడు విష్ణువర్ధన్ రోగులకు ఉచితంగా పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవా పక్వాడ్ మండల కన్వీనర్ నారాయణమూర్తి, కిసాన్ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్ట్



నిందితుడిని అరెస్ట్ చేసి చూపిస్తున్న సీఐ దొరరాజు, ఎస్సై సురేష్‌బాబు

రాయవరం: గంజాయి కేసులో పరారీలో ఉన్న నిందితుడ్ని సోమవారం అరెస్ట్ చేసినట్లు రాయవరం ఎస్సై డి.సురేష్‌బాబు తెలిపారు. జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ ఏవీఆర్‌బీ ప్రసాద్ సూచనలతో రామచంద్రపురం డీఎస్పీ బి.రఘువీర్ పర్యవేక్షణలో అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 23న గంజాయిని అక్రమంగా తరలిస్తున్న కేసులో మండపేటకు చెందిన మందపల్లి డానియల్ 6వ నిందితుడిగా ఉన్నారన్నారు. కేసు నమోదు చేసిన నాటి నుంచి పరారీలో ఉన్న డానియల్ మండపేట బైపాస్ రోడ్డులోని స్ప్రింగ్ బోర్డు స్కూల్‌కు వెళ్లే రహదారి వద్ద ఉన్నట్లుగా రూరల్ సీఐ పి.దొరరాజుకు వచ్చిన సమాచారంతో నిందితుడ్ని అరెస్ట్ చేశామన్నారు. అతడిని కోర్టుకు తరలించినట్లు ఆయన తెలిపారు.

కోకో మొక్కలు పెంచేలా ప్రోత్సహించాలి

అంబాజీపేట: రైతులు ఆర్థికాభివృద్ధి చెందేలా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేలా కోకో పెంచేలా ప్రోత్సహించాలని ఉపాధి హామీ పథకం పీడీ డి.రాంబాబు అన్నారు. అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం సిబ్బందితో ఏపీఓ ఎస్‌వీ కృష్ణ అధ్యక్షతన సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. పీడీ రాంబాబు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో కొబ్బరి తోటలో అంతర పంటగా కోకో పంటను పెంచేలా కృషి చేయాలన్నారు. మినీ గోకులం షెడ్లు నిర్మించుకునే అర్హులైన లబ్ధిదారులతో త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయించాలన్నారు. శానిటేషన్‌లో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీలో ఇంటికో కంపోస్టు పిట్ తవ్వడానికి ప్రచారం చేయించాలన్నారు. ఇంటి ఆవరణలో చెత్తను కంపోస్టు పిట్‌ను తయారు చేసే విధానాన్ని వివరించాలన్నారు. సేంద్రియ ఎరువు తయారై రైతులకు ఉపయోగపడుతుందనే విషయాన్ని వివరించాలన్నారు. అనంతరం క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. ప్లాంటేషన్ మేనేజర్ ఎం.త్రినాథ్, జూనియర్ ఇంజినీర్ పి.వెంకటేశ్వరరావు, టెక్నికల్ అసిస్టెంట్లు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

కొబ్బరి చెట్ల వేలంలో రూ.4.56 లక్షల ఆదాయం

తాళ్లరేవు: సుంకరపాలెం పంచాయతీ పరిధిలో ఉన్న కొబ్బరిచెట్లకు సోమవారం నిర్వహించిన వేలంపాటలో పంచాయతీకి రూ.4.56 లక్షల ఆదాయం సమకూరింది. స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ టేకిళ్లపూడి నాగేశ్వరరావు సమక్షంలో డిప్యూటీ ఎంపీడీఓ ప్రకాశరావు, పంచాయతీ కార్యదర్శి వలీబాబా అధ్యక్షతన బహిరంగ వేలంపాట నిర్వహించారు. ఐదు ప్రాంతాల్లో ఉన్న సుమారు 215 కొబ్బరిచెట్లకు మూడేళ్ల కాలానికి వేలంపాట జరిగింది. గతంలో ఈ పాట రూ.2.60 లక్షలు ఉండగా, ఈసారి రూ.4.56 లక్షల రికార్డు ధరకు వంగా వీరబాబు పాడుకున్నారు.

రెండు మండలాలను అమలాపురం డివిజన్‌లో కలపాలి

అంబాజీపేట: అంబాజీపేట, అయినవిల్లి మండలాలను అమలాపురం డివిజన్‌లో కలపాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం కలెక్టర్‌కు సోమవారం మాజీ ఎంపీపీ దాసరి వీరవెంకట సత్యనారాయణ వినతిపత్రం అందజేశారు. ఈ రెండు మండలాలను కొత్తపేట డివిజన్‌లో విలీనం చేయడం వల్ల సుమారు 20 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తుందని, అమలాపురం డివిజన్‌లో అయితే ప్రజలందరికీ దగ్గరగా ఉంటుందని కలెక్టర్‌కు వివరించారు.

పేద విద్యార్థులకు చేయూత

రాజోలు: ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు చేయూతనందిస్తున్న ఆల్ ఇండియా స్టూడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఏఎస్‌డబ్ల్యూఏ) సేవలు అభినందనీయమని పలువురు అన్నారు. నియోజకవర్గంలోని పలు విద్యాసంస్థల్లో విద్య అభ్యసిస్తున్న పేద విద్యార్థులకు యూనిఫారం, పుస్తకాలు అందించారు. ఫీజులు కట్టుకోలేని వారికి ఆర్థికంగా చేయూతనిస్తామని అసోసియేషన్ అధ్యక్షుడు పోలిశెట్టి గణేష్ తెలిపారు.

వైభవంగా బేతాళ స్వామి కలశ స్థాపన

అంబాజీపేట: విజయదశమి శరన్నవరాత్రులను పురస్కరించుకుని అంబాజీపేట, మాచవరం శెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే విజయ బేతాళ స్వామి ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి వారి కలశ స్థాపన నిర్వహించారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు దొమ్మేటి వెంకట రామారావు, మట్టపర్తి రాము, ఉత్సవ కమిటీ చైర్మన్ శీలం సత్య అర్జున మోహనరావు, సంఘ సభ్యుల ఆధ్వర్యంలో మాచవరం దుర్గాక్షేత్రం రామ్ ఘాట్ వద్ద నుంచి అఖండ దీపాన్ని ఏర్పాటు చేసి పురవీధుల గుండా ఊరేగించారు. స్థానిక నాలుగు రోడ్ల సెంటర్‌లో పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. ప్రదర్శనలో చేడీ తాలింకానా, తీన్‌మార్ డాన్సులతో బేతాళ స్వామిని ఊరేగించి పెద్ద వీధిలోని ఆలయంలో ప్రతిష్ఠించారు. అంబాజీపేట పశువుల మార్కెట్, కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

గ్రామాల్లో అన్నదానాలు

కె.గంగవరం: మండలంలోని కె.గంగవరం, బాలాంత్రం, శేరిలంక గ్రామాల్లో సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నవరాత్ర ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలతో పాటు గ్రామానికి చెందిన భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు

కపిలేశ్వరపురం (మండపేట): పట్టణంలోని పలు చోట్ల నేటి నుంచి ప్రత్యేక నవీకరణ శిబిరాలు నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు సోమవా రం తెలిపారు. ఈ నెల 23, 24వ తేదీల్లో 1వ వార్డు గొల్లలగుంట సచివాలయంలో నిర్వహించనున్నారు. ఈ నెల 25, 26 తేదీల్లో 2వ వార్డు హరిజనవాడ శ్రీరామ హిందూ మున్సిపల్ స్కూల్ సమీపంలోని సచివాలయంలో శిబిరాలను నిర్వహించనున్నారు. ఆయా శిబిరాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటలు వరకూ ఆధార్ వివరాలను నవీకరిస్తారన్నారు. 6 నెలల లోపు శిశువులకు బాల ఆధార్ నమోదు చేస్తారన్నారు. 5–15 ఏళ్ల వయసు దాటిన చిన్నారుల బయోమెట్రిక్ వివరాలను తప్పనిసరిగా నవీకరించుకోవాలని కమిషనర్ తెలిపారు.

జగన్మాతా.. నమోస్తుతే..

- గ్రామాల్లో శరన్నవరాత్ర ఉత్సవాలు ప్రారంభం
- మండపాల్లో కొలువైన అమ్మవార్లు
- విశేష అలంకరణల్లో దర్శనాలు



టిడ్కో గృహాల సముదాయం వద్ద అమ్మవారిని దర్శించుకుంటున్న చైర్‌పర్సన్ దుర్గారాణి



విశేష అలంకరణలో అంగర విజయదుర్గాంబిక అమ్మవారు



సత్యవాడ చెరువు వీధిలో కొలువుదీరిన దుర్గాదేవి



దుర్గాదేవి అవతారంలో ద్రాక్షారామ కన్యకా పరమేశ్వరి



బాలాత్రిపుర సుందరిగా ఆదివారపుపేట పార్వతీ అమ్మవారు



కొత్తూరు జోడు తూముల వద్ద ఉన్న కనకదుర్గమ్మ

కపిలేశ్వరపురం: నియోజకవర్గంలో దేవీ నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. విజయానికి చిహ్నంగా కనకదుర్గమ్మను కొనియాడుతూ భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. మండపేట పట్టణం, రూరల్ మండలం, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల్లో శరన్నవరాత్ర శిబిరాలు సందడిగా మారాయి. మండపేట పట్టణంలోని రథం గుడిలో అమ్మవారి పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ల పాల్గొన్నారు. 20వ వార్డు టిడ్కో గృహాల సముదాయం తదితర శిబిరాల వద్ద చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు రెడ్డి రాధాకృష్ణ దసరా ఉత్సవాల్లో పాల్గొన్నారు. రూరల్ మండలంలోని మారేడుబాక, ఏడిద, తాపేశ్వరం, ద్వారపూడి, ఏడిద సావరం, ఏడిద సీతానగరం, కేశవరం, జెడ్ మేడపాడు, పాలతోడు, వెలగతోడు, చిన ద్వారపూడి, మెర్నిపాడు గ్రామాల్లో శరన్నవరాత్ర శిబిరాల్లో పూజలు ప్రారంభమయ్యాయి.

కపిలేశ్వరపురం మండలంలో..

మండలంలోని 19 గ్రామాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. తాతపూడి, కపిలేశ్వరపురం, అంగర, వెదురుమూడి, వల్లూరు, నేలటూరు, నిడసనమెట్ట, వడ్లమూరు, కాలేరు, అచ్యుతాపురం, నల్లూరు, టేకి, మాచర, కోరుమిల్లి, నాగుల చెరువు, వాకతిప్ప, అద్దంకివారిలంక, కేదారిలంక గ్రామాల్లో అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. సెలవు రోజులు కావడంతో విద్యార్థులు సందడి చేశారు. భవానీ మాలను ధరించిన భక్తులు పీఠాల్లో పూజలు చేశారు.

కె.గంగవరం: చెడుపై మంచి విజయం సాధించడానికి సూచికగా జరుపుకునే శరన్నవరాత్రులు మండలంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని పామర్రు, పాణింగపల్లి, కె.గంగవరం, యర్రపోతవరం, మసకపల్లి, బ్రహ్మపూరి తదితర గ్రామాల్లో వేదపండితులు అమ్మవార్లకు ప్రాణ ప్రతిష్ఠ పూజలు నిర్వహించారు. పలు రకాలుగా ఆకట్టుకునేలా ఏర్పాటు చేసిన అమ్మవార్లను గ్రామస్తులు పూజలు చేసి దర్శించుకున్నారు. తొమ్మిది రోజులపాటు భజనలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశామని ఆయా గ్రామాల్లోని కమిటీ సభ్యులు తెలిపారు. అముజూరులోని బాలాత్రిపుర సుందరీ దేవి పీఠాధిపతి వెలవలపల్లి అరుణ్ శర్మ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి పూజలను వైభవంగా ప్రారంభించారు.

కాజులూరు: మండలంలోని శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం నుంచి 11 రోజులపాటు నిర్వహిస్తున్నారు. ఆలయాలు లేని పలు గ్రామాల్లో సైతం ప్రధాన కూడళ్లలో తాటాకు పందిళ్లతో ఆంగడి గుడిలను నిర్మించి భక్తులు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉదయం, సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి విజయదశమి అనంతరం అక్టోబరు 2న మహోత్సవాలకు భక్తులు ఉద్వాసనం చెబుతారు. ఇందులో భాగంగా పలు గ్రామాల్లో భక్తులు భవానీ దీక్షలు ప్రారంభించారు. ప్రతీరోజు పూజా కార్యక్రమాలతోపాటు ఆలయాల్లో రోజుకో విధంగా ప్రత్యేక హోమాలు, లక్షపత్రి పూజా, లక్ష కుంకుమార్చనలు నిర్వహించనున్నారు. గొల్లపాలెం దుర్గాదేవి ఆలయంలో విశ్రాంత జిల్లా సాంఘిక సంక్షేమశాఖాధికారి ధనరాజు, ఇందిరా దంపతులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రామచంద్రపురం రూరల్: దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు దేవాలయాల్లో శరన్నవరాత్రులు సోమవారం ప్రారంభమయ్యాయి. ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో 12వ శక్తిపీఠం మాణిక్యాంబా అమ్మవారి సన్నిధిలో ఆలయ ఈఓ అల్లు వెంకట దుర్గాభవాని ఉత్సవాలను ప్రారంభించారు. మొదటి రోజు దుర్గాదేవి అవతారంలో కన్యకా పరమేశ్వరీ అమ్మవారిని అలరించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొమ్మిశెట్టి గోపాల్, ఉపాధ్యక్షుడు పసుమర్తి సూర్యశేఖర్, ప్రధాన కార్యదర్శి అప్పన రాజశేఖర్ తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆదివారపుపేట శ్రీశివబాలయోగి మహారాజ్ ఆశ్రమంలో పార్వతి అమ్మవారు మొదటి రోజు బాలా త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు.

రామచంద్రపురం: పట్టణంలోని శివాలయం పార్కు వద్ద కనకదుర్గమ్మ, కొత్తూరు జోడు తూముల వద్ద ఉన్న దుర్గాదేవి సోమవారం బాలాత్రిపుర సుందరీగా భక్తులకు దర్శనమిచ్చారు. దాతలు కంతేటి సూర్యనారాయణ, సుబ్బలక్ష్మి దంపతులు, కొమ్మిరెడ్డి సూర్యచంద్ర దుర్గాప్రసాదరావు, గంగామణి దంపతుల సౌజన్యంతో అమ్మవారిని అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.